జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 12-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 69 పేజీలు: 8 వెల : రూ.7



# అడ్డంగా.. దోచేస్తున్నారు!

- ✻ ఇచ్ఛాపురం ఏఎంసీలో వసూళ్ల దందా
- ✻ బెల్లుపడ పాత టోల్ ప్లాజా వద్ద కలెక్షన్లు
- ✻ రెండేళ్లుగా ఇదే తంతు
- ✻ అధికారులు, గత పాలకుల అండదండలతో రెచ్చిపోతున్న సెక్యూరిటీ గార్డులు, సిబ్బంది

**ఇచ్ఛాపురం/శ్రీకాకుళం, జులై 11(వార్త):**జాతీయ రహదారిపై బెల్లుపడ పాత టోల్‌ప్లాజా వద్ద ఎర్రజెండా పట్టుకుని ఇచ్ఛాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు వసూళ్ల దందా చేస్తున్నారు. పైసలిస్తే ఒకలా.. లేకుంటే మరోలా రెచ్చిపోయి లారీ డ్రైవర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి దోచేస్తున్నారు. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. అధికారులు అండదండలతో వారు రెచ్చిపోతున్నారు. గతంలో పురుషోత్తం ఇంటిగ్రేట్ చెక్ పోస్ట్ వద్ద మార్కెట్ కమిటీ తనిఖీ కేంద్రం ఉండేది. 2017లో జీఎస్టీ వచ్చిన తర్వాత చెక్ పోస్ట్‌లను ఎత్తివేశారు. ఆ తర్వాత ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీ కార్యాలయం గొర్లెపాడు యార్డు వద్దకు తరలించారు. అనంతరం గొర్లపాడులో ఓ సెక్రెటరీ నిర్వాకంతో కరాపాడు టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై అడ్డంగా కారు నిలిపి వసూళ్ల దందాకు తెరదీశారు. ఆ తర్వాత ఆ సెక్రెటరీ కోట్లాది రూపాయల కుంభకోణం వెలుగుచూసి కటకటాల పాలయ్యారు. ఇంకా ఆ కేసు పూర్తిగా తేలలేదు. ఈ వ్యవహారం అనంతరం జాతీయ రహదారిపై బెల్లుపడ టోల్‌గేట్ వద్ద కొంతమంది సిబ్బంది, సెక్యూరిటీ కార్డులు కలిపి రోడ్లపై లారీలను, వాహనాలను ఆపి వసూళ్లకు పాల్పడుతున్నారు. కేవలం ధాన్యం సీజన్లో మార్కెట్ కమిటీ సెస్ వసూలు చేసేందుకు మాత్రమే వాహనాలు నిలిపేవారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీల అధికారికి కూడా రహదారిపై వాహనం నిలపాలంటే కొన్ని నిబంధనలు తప్పనిసరి. అలాగే పోలీసులకు కూడా వారి స్థాయిని బట్టి వాహనాలు ఆపే అధికారం ఉంటుంది. కానీ ఎర్రజెండా పట్టుకొని రోడ్డుకి అడ్డంగా లారీ ఆపి అందిన కాడికి దోచుకుంటున్నారు. ఒకే ప్రాంతానికి చెందినవారు ఎక్కువగా సూపర్వైజర్లు, సెక్యూరిటీ గార్డ్‌లుగా ఉండడంతో ఎవరు ఏమి అనలేని పరిస్థితి ఉంది. గతంలో నమోదైన ఏసీబీ కేసులతో పాటు ఇటీవలి సెక్రటరీ చేసిన అక్రమాల వల్ల అందులో భాగస్వామి ఉన్న మరి కొంతమందిని విధుల్లో తొలగించారు. అయినప్పటికీ మిగిలిన సిబ్బంది యధేచ్ఛగా వాహనాలను నిలిపి దోచుకోవడం సర్వత్ర చర్చనీయాంశమైంది. గత మార్కెట్ కమిటీ చైర్మన్‌ల అండ దండలు ఉన్నాయంటూ కొందరు బహిరంగంగా నిబంధనలు అతిక్రమిస్తూ లారీల నుంచి గత రెండేళ్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇక్కడ పనిచేస్తున్న చైర్మన్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. అయినప్పటికీ సిబ్బంది రాత్రి పగలు తేడా లేకుండా 24 గంటలు బెల్లు పడ పాత టోల్ ప్లాజా వద్ద కలెక్షన్లకు శ్రీకారం చుట్టారు. జిల్లా ఉన్నతాధికారులతోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఈ వ్యవహారంపై ఓ కన్నేయాలని స్థానిక టీడీపీ నాయకులు కొందరు కోరుతున్నారు.



# కలెక్టర్ సుడిగాలి పర్యటన

- ✻ పాతపట్నం సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ
- ✻ వార్డుల్లో కలియదిరిగి వైద్యసేవలపై ఆరా
- ✻ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో తనిఖీ

**పాతపట్నం, జులై 11 (వార్త):** రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, వారికి అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సూచించారు. పాతపట్నం సీహెచ్‌సీని గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రోగుల వార్డులను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆక్సిజన్ ప్లాంట్ పనితీరు, డయారియా కేసుల వివరాలు, రోగులకు అందుతున్న సేవలను, ఓపీ, ఇన్ పేషెంట్ వివరాలను వైద్యురాలు అనితను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. వంటగదులు, వంట పాత్రలను పరిశీలించారు. భోజనాన్ని రుచి చూశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి తెలియజేశారు. ఆయనతో తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ్‌రామ్, ఏపీఓ సురేష్, ఏపీఎం మణిరత్నం, ఎంఈఓలు శ్రీధర్, తిరుమలరావులు, ఆర్ఐ భువన్‌కుమార్, ఈఓపీఆర్డీ కృష్ణారావు పాల్గొన్నారు.



### విద్యాశాఖలో పీఈటీలను

# విలీనం చేయండి

- ✻ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి
- ✻ ఎమ్మెల్యే అశోక్‌ను కోరిన సంఘ నాయకులు

**కవిటి, జులై 11 (వార్త):** సర్వశిక్షా అభియాన్ పరిధిలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న పీఈటీలను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించేలా చూడా లని కోరుతూ ఎమ్మెల్యే బి.అశోక్‌ను ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాన్ని అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 550 మంది పీఈటీలు ఉన్నారని, డీఎస్సీలో వాటిని చూపించటం లేదన్నారు. దీనివల్ల తాము నష్టపోయే అవకాశం ఉందని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని విద్యాశాఖామంత్రి ఎన్.లోకేష్‌తో మాట్లాడి న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ప్రభుత్వం దృష్టికి విద్యారంగ సమస్యలు

**నందిగాం:** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నందిగాం, నర్శిపురం ఉన్నత పాఠశాలలతోపాటు నర్శిపురం, మద్దిలినివానిపేట ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అక్కడి ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధానకార్యదర్శులుబాబూరావు, జి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లాకార్యదర్శి బాలక శంకరరావు, సహాధ్యక్షులు దాలయ్య, కె.కుమారస్వామి, గణపతి ఉన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వీరఘట్టం, జులై 11 (వార్త):** వీరఘట్టం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 33 కె.వి మెయింటినెన్స్, ఇతర పనులు నిర్వహించటం వల్ల శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.జి.కె.మూర్తి గురువారం విలేకరులకు తెలిపారు. వీరఘట్టం సబ్ స్టేషన్ పరిధిలో కడకెళ్ళ, నడిమికెళ్ళ, విక్రంపురం, కంబర, నడుకూరు, వీరఘట్టం, చలివేంద్రి, దశుమంత పురం, మహదేవివలస, నర్సిపురం, కొట్టుగుమడ, గడగమ్మ, రేగులపాడు, చిదిమి, తూడి పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ మూర్తి కోరారు.

## కొత్త పనుల ప్రతిపాదనలు..

# రద్దు చేయండి

* పాత పనులకు బిల్లులు చెల్లించాలి
* ఎమ్మెల్యే కూన రవికుమార్
* డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్స్‌తో సమావేశం



**ఆమదాలవలస, జులై 11 (వార్త):** మున్సిపాలిటీలో సుమారు 17 కొత్త పనుల ప్రతిపాదనలను రద్దు చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం పురపాలక సంఘం కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్స్‌తో సమావేశంలో మాట్లాడుతూ గతంలో చేపట్టిన పాత బిల్లులకు డబ్బులు చెల్లించి కొత్త పనులకు ప్రతిపాదనలో సిద్ధం చేయాలని అధికారులకు రవికుమార్ ఆదేశించారు. గతంలో ఏడు సంవత్సరాల కిందట పైప్ లైన్ పనులకు నిధులు మంజూరు చేయలేదని, సదరు ఆ కాంట్రాక్టర్ ఇంతవరకు బిల్లులు చెల్లించకపోవడం అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. వెంకటేశ్వర ఎంటర్ప్రైజెస్ శ్రీకాకుళం వారిచే చాలా టెండర్లు వేయడం జరిగిందని, ఇంతకు ఆ కాంట్రాక్టర్ ఉన్నారా లేరా అని ప్రశ్నించారు. దీనిపై పూర్తి నివేదిక తనకు అందజేయాలన్నారు. సమావేశంలో కమిషనర్ జి.రవి, ఏఈ అప్పలనాయుడు, టిపిఎస్ హెచ్‌వి సత్యనారాయణ, నాయకులు తమ్మినేని విద్యాసాగర్, తమ్మినేని చంద్రశేఖర్, ఎస్.మురళిరావు, కూన అప్పలనాయుడు, ధవళ అప్పలనాయుడు, జీడి ప్రసాద్, బొడ్డేపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## కందిపప్పు విక్రయ స్టాల్ ప్రారంభం

ప్రతి ఒక్కరికీ సబ్సిడీకి కందిపప్పు అందించడం ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం రైతు బజార్ ఆవరణలో సబ్సిడీపై కందిపప్పు విక్రయాల స్టాల్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత వైకాపా హయాంలో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానంటేయని, సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉండేవారన్నారు. నేడు టిడిపి ప్రభుత్వం సబ్సిడీపై కందిపప్పు విక్రయించాలని ఉద్దేశంతో రైతు బజార్లలో సబ్సిడీపై కందిపప్పును విక్రయిస్తోందన్నారు. టీడీపీ హయాంలో నిత్యవసర వస్తువులు నిలకడగా ఉన్నాయని అన్నారు. పేదవాడు అవసరాలు తీర్చడమే టిడిపి ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. రైతు బజార్లో ప్రజలకు అనుకూలంగా ధరలు ఉంటాయని, ప్రజలు నేరుగా రైతు బజార్లో సరుకులు కొనుగోలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ తమ్మినేని గీత, తమ్మినేని చంద్రశేఖర్, తమ్మినేని విద్యాసాగర్, ఇంజరాపు విశ్వనాదం, బాటా శీను, బరాటం జగదీష్, డిప్యూటీ తాసిల్దార్ డి.అమర్నాథ్, కె.రాము, రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.






## గంజాయి అక్రమ రవాణా అరికట్టాలి

**పలాస, జులై 11(వార్త):** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం కాశీబుగ్గలో ఏఐవైఎఫ్ శ్రీకాకుళం జిల్లా సమితి ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరు వాసు, కోన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ పలాస కేంద్రంగా జరుగుతున్న గంజాయి అక్రమ వ్యాపారాన్ని అరికట్టడంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీస్ యంత్రాంగం విఫలమైందన్నారు. పలాస రైల్వే స్టేషన్ ద్వారా అనేక ప్రాంతాల నుంచి గంజాయి రవాణా సాగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పాఠశాలలు, కాలేజీల కేంద్ర ంగా విద్యార్థులు, యువతకు తినుబండారాల రూపంలో మత్తుమందును కలిపి మత్తు పదార్థాలకు యువతను బానిసగా చేస్తున్నారన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రతి పాన్ షాపుల్లో కూడా గుట్కా, ఖైనీ, పాన్ పరాగ్ లను విక్రయిస్తున్నారని వాటిని కూడా నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు గుణశేఖర్, దిలీప్, వెంకటరావు, వల్లభ రావ్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తం



**ఆమదాలవలస, జులై 11 (వార్త):** సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ చిగురుపల్లి చిన్ను అన్నారు. మెట్టెక్కివలసలో యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాల బారినపడిన వారు టోల్ ఫ్రీ నెంబర్ 1930, పిఎంజెజెవై, పిఎంఎస్‌బివై ఇన్సూరెన్స్ కోసం బ్యాంక్ ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మ్యాన్ టోల్ ఫ్రీ నెంబర్ 1448 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే ఏటీఎం కార్డు వల్ల కలిగే ఉపయోగాలను ఖాతాదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సీఓ మెట్ట అమ్మి నాయుడు, ఆర్ పి శోభారాణి, జయలక్ష్మి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు స్టాప్ డయేరియా

**ఆమదాలవలస, జులై 11 (వార్త):** గ్రామీణ ప్రాంతంలో పారిశుద్ధ్య లోపం వల్ల ఎక్కువగా వస్తున్న సీజనల్ వ్యాధులను అరికట్టుటకు స్టాప్ డయేరియా, డెంగ్యూ, మలేరియా కార్యక్రమాన్ని చేపట్టామని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. గురువారం బొబ్బిలి పేట పంచాయతీ కార్యాలయం, పాఠశాల, అంగన్వాడీ కేంద్రం తదితర అన్ని ప్రదేశాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో ఎక్కడైనా నీటి నిల్వలు ఉన్న ప్రదేశాలలో ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి పూర్ణిమాకు సూచించారు. స్థానిక పాఠశాల పరిధిలో ప్రధాన ఉపాధ్యాయుడు మెట్ట బట్లు ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు రమణ, సుభద్రతో పాటు వివోఏ. శ్యామల, అంగన్వాడీ కార్యకర్త గురువుబెల్లి సన్యాసమ్మ, గ్రామ సంఘం ప్రతినిధులు పైడి వనజాక్షి, రోహిణి, కూన కళ్యాణి, ఆశా వర్కర్లు, స్వయం శక్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## పశుగ్రాసం పెంపకంతో అదనపు ఆదాయం

**వీరఘట్టం, జులై 11 (వార్త):** పశుగ్రాసం పెంపకం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందని వీరఘట్టం పశువైద్యాధికారి పి.చైతన్య శంకర్ రైతులకు సూచించారు. గురువారం పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా మండలంలోని దశమంతపురం గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా మంచి నాణ్యమైన పశుగ్రాసాన్ని పెంచడం వల్ల పశువులు ఆరోగ్యంతో పాటు, జీర్ణశక్తి కూడా మెరుగుపడుతుందన్నారు. అలాగే పశుగ్రాసాన్ని సంవత్సరం అంతా ఉపయోగిస్తే దాణా ఖర్చు కూడా బాగా తగ్గుతుందని దీని ద్వారా రైతు ఆర్థికంగా ప్రయోజనం పొందుతారన్నారు. పశుగ్రాసాన్ని పెంచడంలో కూడా మెలకువలను రైతులకు వివరించారు. ప్రతి రైతు పశుగ్రాసాన్ని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి

**నరసన్నపేట/ జలుమూరు, జులై 11 (వార్త):** రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ల ధరించకపోవడంతోనే మరణాలు సంభవిస్తున్నాయని నరసన్నపేట తహశీల్దార్ పి.కనకారావు పేర్కొన్నారు. గురువారం నరసన్నపేట మున్సిపల్ మెజిస్ట్రేట్ కార్యాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా హెల్మెట్ ధారణపై అవగాహన అవగాహన ర్యాలీ నిర్వహించారు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో మరణాల సంఖ్య కేవలం హెల్మెట్ లేకపోవడం వలన జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్క ద్విచక్ర వాహనచోదకుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో కోర్టు కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జనాభా నియంత్రణపై అవగాహన అవసరం



**వీరఘట్టం, జులై 11 (వార్త):** జనాభా నియంత్రణపై అవగాహన అవసరమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మానస, నితీస అన్నారు గురువారం బిటివాడ పిహెచ్‌సిలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. బిటివాడ తో పాటు అన్ని సచివాలయాల కేంద్రాల్లో ర్యాలీలను నిర్వహించారు. చిన్న కుటుంబం చింతలేని కుటుంబం, ఇద్దరు పిల్లలు ఇంటికి ముద్దు అనే నినాదాలతో చైతన్య ర్యాలీ కొనసాగింది. వైద్యసిబ్బంది, ఆయా గ్రామస్థులు పాల్గొన్నారు.

## జనాభా పెరుగుదలతో సమాజాభివృద్ధికి విఘాతం

**నరసన్నపేట/జలుమూరు, జులై 11 (వార్త):** జనాభా పెరుగుదలతో సమాజ అభివృద్ధి కుంటుపడుతుందని వైద్యాధికారులు సుజాత తెలిపారు. నరసన్నపేట మండలం ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పోలాకి పీహెచ్సీని సందర్శించిన కేంద్ర బృందం



**పోలాకి/జలుమూరు, జులై 11 (వార్త):** పోలాకి ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం సందర్శించింది. విద్యానిధి (ఢిల్లీ) నేతృత్వంలో మొత్తం ఆరుగురు సభ్యులు ఆసుపత్రిలోని టీబీ విభాగాన్ని పరిశీలించారు. మూడేళ్ల కిందట ఆసుపత్రికి అందజేసిన ఉపకరణాలు ఎలా ఉపయోగిస్తున్నారని వైద్యాధికారిణి సుజాతను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల అనంతరం క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఏయే మందులు ఇస్తున్నారని ప్రశ్నించారు.

## నేటి నేరవార్తలు



### నాటుసారా స్థావరాలపై
## సెబ్ దాడులు

*** 600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం**
*** 15 లీటర్ల నాటుసారా స్వాధీనం**

**మందస, జులై 11 (వార్త):** సోంపేట స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బందితో కలిసి మందస మండలం కొండలోగాం పంచాయతీ పరిధిలో గల బాతుపురం గ్రామంలో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. అప్పటికే నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. 15 లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని సీఐ జైభీం చెప్పారు. గ్రామం లో ఎవరు నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారనే కోణంలో విచారణ చేసి వారిపై కూడాతగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దాడుల్లో టాస్క్ఫోర్స్ సీఐ రామచంద్ర కుమార్, సెబ్ సిబ్బంది కాంతారావు, భీమారావు, నాయుడు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి
### అయ్యవారిపేటలో విషాదఛాయలు



**బూర్జ, జులై11(వార్త):** అయ్యవారి పేటలో అప్పుడే తెల్లవారుతోంది.. ఓ విషాద వార్త గ్రామానికి చేరుకుంది.. గ్రామమంతా ఉరుకులు, పరుగులు తీశారు.. ఎవరికీ ఏమీ అర్థం కావడం లేదు.. ఓ పక్క ఏడుపులు, పెడబొబ్బలు వినిపిస్తున్నాయి.. భార్గవుకు యాక్సిడెంట్ అయిందని కొందరు.... అక్కడికక్కడే మరణించాడని మరికొందరు... లారీ ఢీ కొట్టిందని ఇంకొందరు ఇలా రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. ఏది ఏమైనా గ్రామంలో ఆ యువకుడికి సంబంధించిన కుటుంబ సభ్యులు బంధువులు మిత్రులు స్థానికులు ప్రమాద సంఘటన స్థలానికి చేరుకున్నారు.. భార్గవ్ మృతదేహం రోడ్డుపై పడివుండడాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. వివరాల్లోకి వెళితే.. అయ్యవారిపేట గ్రామానికి చెందిన చోడవరపు లక్ష్మణుడు, సూర్యం దంపతుల కుమారుడు చోడవరపు భార్గవ్ కుమార్ రెడ్డీస్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మరికొద్ది నెలల్లో జాబ్ పర్మినెంట్ కానుంది. భార్గవ్ ప్రతిరోజు ఉదయం ఉద్యోగ నిమిత్తం తన సొంత గ్రామమైన అయ్యవారిపేట నుండి శ్రీకాకుళం మీదుగా పైడి భీమవరం రెడ్డిస్ ల్యాబ్ లో విధులు నిర్వహించేందుకు బైక్పై వెళుతుండేవాడు. గురువారం ఉదయం ఐదు గంటలకు ఇంటి నుండి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరి వెళ్లాడు. సింగన్నపాలెం సి ఎస్ పి రోడ్డు వద్ద మరమ్మతుకు గురైన లారీ రోడ్డు పక్కనే ఆగివుంది. ఎదురుగా వస్తున్న వాహనం లైటింగ్ వల్ల ఆగి ఉన్న లారీ కనిపించకపోవడంతో ఆ లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో భార్గవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సమాచారాన్ని తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. భార్గవ్ మృతదేహాన్ని పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మా ఇంటి దీపం ఆరిపోయింది..

మా ఇంటి దీపం ఆరిపోయిందంటూ ఆ తల్లిదండ్రులు కుమారుని మృతదేహంపై పడి రోదిస్తున్న దృశ్యం పలువురు హృదయాన్ని కలచివేసింది. మా కుమారుడు క్రమశిక్షణతో మెలిగి చదువు తప్ప వేరే ధ్యాస ఏమీ లేకుండా ప్రయోజకుడై ఉద్యోగాన్ని సంపాదించుకున్నాడని, ఇక మా కష్టాలు కడతీరుతాయని, అనుకునే లోపే విధి వక్రీకరించిందని కన్నీరుమున్నీరయ్యారు. భార్గవ్ మృతితో అయ్యవారిపేట గ్రామంలో విషాద ఛాయిలు అలముకున్నాయి.





## కాలువలు ఇలా.. సాగునీరు అందేదెలా?

*** తుప్పలు, గుర్రపుడెక్కలతో నిండిన వంశధార కాలువ * ఆయకట్టుకు అందని సాగునీరు * ఆందోళనలో రైతులు**

**పోలాకి/జలుమూరు, జులై 11 (వార్త):** పోలాకి మండలం ప్రియాగ్రహారం పంచాయతీ పరిధిలోని సంగమయ్య పేట, కాకినాడ పేట గ్రామాల ఆయకట్టుకు సాగునీరందించే 14ఆర్ కాలువ పూడుకుపోయి తుప్పలతో నిండిపోయింది. దీంతో శివారు ప్రాంతాల్లోని భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నామని, సాగునీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్పందించి కాలువలో పూడికలు తొలగించి సాగునీరు ప్రవహించేలా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

## ట్రిపుల్ ఐటీ కోర్సు మెరిట్ లిస్టు విడుదల




**శ్రీకాకుళం టౌన్, జులై 11 (వార్త):** రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుకు సంబంధించిన ట్రిబుల్ ఐటీ నాలుగు క్యాంపస్‌ల మెరిట్ లిస్టును ఛాన్సలర్ ఆచార్య ప్రొఫెసర్ కె.సి.రెడ్డి విడుదల చేశారు. అభ్యర్థుల మెరిట్ జాబితా ఆధారంగా న్యూజివీడు, శ్రీకాకుళం, ఆర్.కె.వ్యాలీ, ఒంగోలు నాలుగు క్యాంపస్ లలో నాలుగు వేలు పైచిలుకు సీట్లు ఉన్నాయి. ఆయా రిజర్వేషన్‌లు పాటిస్తూ విద్యార్థుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. వారికి కేటాయించిన ప్రాంగణాల్లో కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరు కావాలని ప్రొఫెసర్ కేజీ రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం ప్రాంగణానికి సంబంధించి 685 అమ్మాయిలు, 325 ముంది అబ్బాయిలు, ప్రత్యేక కేటగిరీ కింద 100 మంది ఎంపికైనట్లు డైరెక్టర్ ప్రొఫెసర్. కె.వి.జి.డి బాలాజీ, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ తెలిపారు.

### నరసన్నపేట విద్యార్థులు ఎంపిక

**నరసన్నపేట, జులై11 (వార్త):** నరసన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలలో ప్రవేశాలు పొందినట్లు ఉపాధ్యాయులు గురువారం తెలిపారు. విద్యార్థులు మెర్సీ, మధుసూదన్ రావు నూజివీడు త్రిపుల్ ఐటీలో, దివ్య శ్రీకాకుళం త్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు అర్హత సాధించారు.

### మామిడిపల్లి విద్యార్థిని..

**పలాస,జులై11(వార్త):** మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన ఎం.హరిత(588) నూజివీడు త్రిబుల్ ఐటీకు ఎంపికైంది. మురుపింటి హరిత కాశీబుగ్గ చైతన్య స్కూల్లో పదో తరగతి చదివింది. హరిత తాతయ్య వంకల రాజారావు సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. హరిత ఎంపిక పట్ల చైతన్య పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు పలాస కాశీబుగ్గ ప్రెస్ క్లబ్ సభ్యులు సిహెచ్ జగదీష్, రాము, డి.మహరణ, ఎస్.రవి రమేష్, భాస్కరరావు, తిరుమల, నాని, అశోక్, నారాయణలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే మరో నలుగురు విద్యార్థులు కూడా ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.






### ట్రిపుల్ ఐటీకీ 19 మంది విద్యార్థులు

**వీరఘట్టం, జులై 11 (వార్త):** వీరఘట్టం మండలం నుంచి 19 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కి ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారులు ఆర్.ఆనందరావు డి.గౌరీనాయుడు గురువారం విలేకరులకు తెలిపారు. ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులై అత్యధిక మార్కులు సాధించిన 19 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కి ఎంపికయ్యారన్నారు. ఇందులో తలవరం హైస్కూల్ నుండి మజ్జి రాజేష్, తాడేల సాయి శరణ్య, కొరికాన. వాగ్దేవి, అల్లు యోగిత, దేవకివాడ ఉమామహేశ్వరరావు, వావిలపల్లి జ్ఞానేశ్వరి ,తాడేల సాయి గాయత్రి, దేవకివాడ కావ్య, సిర్లి సాయి గణేష్‌లు ఎంపికయ్యారన్నారు. అలాగే నీలానగరం హైస్కూల్ నుండి దుప్పల సౌజన్య, సింగరాతి చరణ్, బుగత రేవతి, బొత్స రామలక్ష్మి, కరణం సోమశేఖర రావు, పరసబోతు ఈశ్వరి ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా తెట్టింగి హైస్కూల్ నుండి భోగాది నీరజ, చించలాపు ఈశ్వర లక్ష్మి ఎంపిక కాగా ,కేజీబీవీ నుండి యడ్ల మాధురి, గంగంపేట ఆశ్రమం పాఠశాల నుండి కూరంగి రోహిత్ ఎంపికయ్యారన్నారు. వీరికి పాలకొండ ఉప విద్యాశాఖ అధికారి పర్రి కృష్ణమూర్తి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గుంట్రెడ్డి రవి ప్రసాద్, దూసి నాగమణి అభినందించారు.

### ట్రిపుల్ ఐటీకి ముగ్గురు ఎంపిక

**మందస, జులై 11 (వార్త):** మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ కు ఎంపికయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హరిపురం నుండి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయుడు గవర ఉమారాజ్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.





జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## పంట యాజమాన్యంపై దృష్టి సారించాలి

**నరసన్నపేట/జలుమూరు, జులై 11 (వార్త):** ఈ ఏడాది ఖరీఫ్ రబీ సీజన్లో చేపడుతున్న పంటలలో భాగంగా కౌలు రైతులు పంట యాజమాన్య పద్ధతులపై ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్ర భారతి తెలిపారు. గురువారం నరసన్నపేట మండలం తామరపల్లి రైతు సేవా కేంద్రంలో కౌలు రైతులతో సమీక్ష నిర్వహించారు. పంట భూములు సాగుకు తీసుకోవడంతో పాటు వ్యవసాయలో మెళకువలు తెలుసుకోవాలన్నారు. అప్పుడే లాభాలు పొందవచ్చునని వివరించారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలన్నారు.

# ఈకేవైసీ పేరుతో గ్యాస్ ఏజెన్సీలో అక్రమాలు

### బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మంగి లక్ష్మి

**ఇచ్ఛాపురం, జులై 11 (వార్త):** స్థానిక వెంకట సిద్ధ బైరవి గ్యాస్ ఏజెన్సీలో ఈకేవైసీ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మంగి లక్ష్మి గురువారం ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని చెప్పారని, దీన్ని అలుసుగా తీసుకొని ఉచిత సిలిండర్లు పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని నిబంధన పెట్టడంతో మహిళలు పెద్ద సంఖ్యలో బారులు తీరుతున్నారన్నారు. తీరా గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చాక ఇన్సూరెన్స్, సురక్ష ట్యూబ్ పేరుతో 460 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గ్యాస్ ఏజెన్సీలో సుమారు పదివేలకి పైగా కనెక్షన్ ఉంటాయని తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులు



ఉచిత సిలండర్లు కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఈకేవైసీ కోసం పడిగాపులు కాస్తున్నారన్నారు. మహిళలు పనులు మానుకొని ఎండలో క్యూ లైన్లు కడుతూ ఇబ్బందికరమైన వాతావరణంలో తిప్పలు పడుతుంటే గ్యాస్ ఇన్సూరెన్స్ కోసం 250 రూపాయలు, సురక్ష ట్యూబ్ కోసం 190 రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై ఏజెన్సీ ప్రతినిధులను మీడియా ప్రతినిధులు వివరణ కోరగా ఐదేళ్లకోసారి ఇన్సూరెన్స్ చేసుకోవాల్సివుందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ కట్టిన వారికే నగదు వస్తుందన్నారు. సురక్ష ట్యూబ్ పాడైన వారికి మాత్రమే తీసుకోవాలని చెబుతున్నామన్నారు.



## తెలుగు తమ్ముళ్లకు అండగా టీడీపీ

**పలాస, జులై11 (వార్త):** సార్వత్రిక ఎన్నికల్లో గ్రామస్థాయిలో తెలుగు దేశం పార్టీ గెలువు కోసం కృషి చేసిన కార్యకర్తలకు అధిష్టానం సముచిత స్థానం కల్పించి అండగా ఉంటుందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు అన్నారు. పలాస టీడీపీ కార్యాలయంలో గురువారం పలాస మండల తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటికే గ్రామస్థాయిలో కృషి చేసిన నాయకులను వదవులు కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక లేక భవన కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, సామాన్య ప్రజలు ఇళ్ల నిర్మాణాలు చేవట్టేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. అటువంటి పరిస్థితి తెలుగుదేశం ప్రభుత్వం రాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచితంగా ఇసుక పంపిణీ చేసే ప్రక్రియకు చేవట్టారన్నారు. కేవలం రవాణా చార్జీలు చెల్లిస్తే ఇంటికే ఇసుక అందుబాటులో వస్తుందని అన్నారు. వంశధార శివారు భూములకు సాగునీరు అందించేలా ఎమ్మెల్యే శిరీష, రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరావు రామ్మోహనాయుడులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. సమావేశంలో పలాస మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, దువ్వాడ సంతోష్ కుమార్, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, వంకల కూర్మారావు, కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రాలు సక్రమంగా తెరవాలి

**ఇచ్ఛాపురం, జులై 11 (వార్త):** అంగన్వాడి కేంద్రాలు, ప్రీ స్కూల్‌లు ప్రతిరోజూ ఉదయం 9 నుండి సాయంత్రం 4 వరకు తప్పనిసరిగా తెరవాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగరాణి అన్నారు. ఆమె అంగన్వాడీ కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిబంధనలు అనుసరించి సమయపాలన పాటించాలన్నారు. నిబంధనలు పాటించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌష్టికాహారం పంపిణీ చేయాలని చెప్పారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో లావణ్య, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## పొల్లాడ నల్లచెరువుకు జలకళ

*** సందర్శించిన ఎమ్మెల్యే గౌతు శిరీష * సాగు నీరు అందించినందుకు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపిన రైతులు, నాయకులు**



**వజ్రపుకొత్తూరు, జులై 11 (వార్త):** పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండలం పొల్లడలో గల నల్ల చెరువుకు వంశధార కాలువ నీరు చేరింది. ఆ చెరువును ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం పరిశీలించారు. సాగునీరు తమ గ్రామంలోని చెరువులో నింపినందుకు గాను రైతులు, గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు సన్మానాలు అవసరం లేదని, మీరు ఇచ్చిన మెజార్టీయే నాకు పెద్ద సన్మానమని అన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి రంగం నిర్వీర్యమై పోయిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతుల కష్టాలు తీర్చే పనులను ప్రారంభించిందని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సూరాడ మోహన్రావు, మాజీ ఎంపీపీ మల్ల సూర్యనారాయణ, గురకల వసంత స్వామి, గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఉత్స ఈశ్వరరావు, మండల పరిషత్ మాజీ విప్ కర్రీ రమణ, మాజీ సర్పంచ్ గోవిందా పాపారావు, రైతులు నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## బాలసదనం చిన్నారులకు బ్యాగుల పంపిణీ

**పలాస, జులై11 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని బాలసదనంలోని విద్యార్థులకు దాతలు బ్యాగులు పంపిణీ చేశారు. పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన రఘునాథ్ ప్రసాద్ పాఢి జ్ఞాపకార్ధంగా ఆయన కుమారుడు రఘుబాబు వీటిని అందజేశారు. అలాగే అన్నదానం చేశారు. కార్యక్రమంలో పవన పుత్ర సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు, మాజీ సైనికులు, సైనికులు, రక్త దాతలు పాల్గొన్నారు.

## మంత్రి అచ్చెన్నను కలిసిన సిరిపురం



**హిరమండలం, జులై11 (వార్త):** పాతపట్నం నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత సిరిపురం తేజేశ్వరరావు గురువారం విజయవాడలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడిని కలిసి కోరారు.

## సీజ్ చేసిన వాహనాలకు నేడు వేలం

**వీరఘట్టం, జులై 11 (వార్త):** వీరఘట్టం పోలీసు స్టేషన్‌లో ఆవరణలో ఉన్న సీజ్ చేసిన వాహనాలకు శుక్రవారం వేలం వేయనున్నట్టు ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు. వీరఘట్టం పోలీస్ స్టేషన్లలో ఏపీ ఎక్సైజ్ యాక్ట్, ఏపీ ప్రొహిబిషన్ యాక్ట్ కేసులలో సీజ్ చేయబడిన 5 వాహనాలకు సంబంధించి పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఆక్షన్ ఆర్డర్స్ జారీచేయగా, వారి ఉత్తర్వులు ప్రకారం వేలం వేయనున్నారు. ఒక ఆటో, రెండు స్కూటీలు, ఒక టీవీఎస్ 50 మోపెడ్, ఒక హీరో ఫ్యాషన్ బైకులకు సంబంధించి వేలంపాటను నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కల వారు ఆక్షన్‌లో పాల్గొని, వాహనాలను పాడుకోవలిసిందిగా ఎస్ఐ కోరారు.

## వామన అవతారంలో జగన్నాథుడు

**హిరమండలం, జులై 11 (వార్త):** జగన్నాథ స్వామి రధాయాత్రలో భాగంగా స్వామి వారు గురువారం వామన అవతార రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథ స్వామి ఆలయ ప్రాంగణంలో గుండిచా మందిరంలో ఏర్పాటు చేసిన జగన్నాథ స్వామికి ఆలయ అర్చకులు సురేష్ పాడి, శ్రీనివాస్ పాడిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హీరా పంచమిని పురస్కరించుకుని లక్ష్మీదేవికి తిరువీధి కనుల పండవగా నిర్వహించారు. జగన్నాథ స్వామి ఆలయం నుంచి మోణింగి వీధి వరకు పల్లకిలో లక్ష్మీదేవి విగ్రహాన్ని పెట్టి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం టౌన్, జులై 11(వార్త):** శ్రీకాకుళం నగరంలోని ఇల్లిసిపురంలో ఉన్న గుండిచా



మందిరంలో జగన్నాథ స్వామి గురువారం ఆలయ ప్రధాన పూజారి సుభాష్ పండా ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. హీరా పంచమిని పురస్కరించుకుని బొందిలీపురం జగన్నాథ స్వామి మందిరం నుంచి గుండిచా మందిరానికి ఊరేగింపుగా లక్ష్మీదేవిని తీసుకువచ్చారు. దారి పొడవునా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.





## ఘనంగా నీలమ్మ తల్లి సంబరాలు



**బూర్జ, జులై 11(వార్త):** ఉప్పెనవలస గ్రామంలో గురువారం నీలమ్మ తల్లి సంబరాలు అంబరాన్ని అంటాయి. గ్రామస్తులందరూ ఐక్యమత్యంతో ఎల్లమ్మ తల్లి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కస్తూరిబా పాఠశాల తనిఖీ

**ఇచ్ఛాపురం, జులై 11(వార్త):** స్థానిక కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం పాఠశాలను ఎంఈఓ కురమాన అప్పారావు తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం వండాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల్లో బోధనా నైపుణ్యాలు పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413